# నకిలీ నెక్‌లేసు

పి. ఎస్. చెన్నారి

విమల పురిట్లోనే తల్లిని పోగొట్టుకోవడంచేత, విమల తండ్రి జానకిరామయ్యగారు రెండో వివాహం చేసుకోక తప్పింది కాదు.

పాపాయి సంరక్షణ భారం జానకిరామయ్యగారి ద్వితీయ కళత్రం లక్షువమ్మమీద పడింది. ప్రథమంలో లక్షువమ్మకి కూడా ఆ ట్టే కష్టమనిపించలేదు. కాని, కాలక్రమేణా విమలమీద పెరగవలసిన 'వాత్సల్య - మమకారాల' స్థానే 'ఈర్ష్యాసూయలు' పెరగసాగినయ్. కారణం, తానూ అలాంటి పాపాయికి తల్లి కావడం కావచ్చు. నిజానికి, తన కుమార్తె కమలమీద చూపే ప్రేమానురాగాలు, సవతికూతురు విమలమీద చూపలేకపోయినా, ఇరుగుపొరుగు యేమనుకొంటారో నన్న భీతిచేత, పైకిమాత్రం కపటప్రేమ నటించేది.

ఈ విషయం జానకిరామయ్యగారు గుర్తించకపోలేదు. కాని, జోక్యం కలిగించుకొన్నా ప్రయోజనం వుండదని గ్రహించి, తెలిసీ తెలియనట్టు వుండిపొయ్యేవాడు.

రోజులు గడుస్తున్నయ్. విమలా, కమలా పెరిగి పెద్దవారయ్యారు. ఆ యేడే యిద్దరికీ పెళ్లిళ్ళయి అత్తవారింట కోడరికం చేస్తున్నారు కూడాను.

సంక్రాంతి దగ్గర పడుతోంది; కూతుళ్ళనీ అల్లుళ్ళనీ తీసుకువొచ్చి యథోచితంగా సత్కరించి పంపించవలసిన బాధ్యత తమకి వుంది కాబట్టి, వారికి ఆహ్వానం పంపక తప్పింది కాదు జానకిరామయ్యగారికి.

ఆ రాత్రి జానకిరామయ్యగారు భార్యవద్ద సంక్రాంతి కానుకల విషయం ప్రస్తావనకి తెచ్చాడు. తమ అల్లుళ్లకి బహూకరించవలసిన కానుకల నిర్ణయానంతరం, కూతుళ్ళ విషయం ప్రస్తావనకి వొచ్చింది. చివరికి, ఒకొక్కటి ఐదేసి వందల కిమ్మత్తుకి తక్కువ కాకుండా, చెరో నెక్‌లేసూ చెల్లించుకోవలసిన కానుకగా ఆమోదింపబడింది. జానకిరామయ్యగారు వెంటనే ఇనప్పెట్టె తెరిచి, వెయ్యి రూపాయలు తీసి, లక్షువమ్మచేత బెట్టి, మాంచి డిజైనులో, నాణ్యమయిన రవ్వలతో, రెండు నెక్‌లేసులూ ఒకేమోస్తరులో, దగ్గరుండి తయారుచేయించే బాధ్యత ఆవిడకే వొదిలిపెట్టాడు.

తన కుమార్తెతో సమానంగా సవతికూతురికి కూడా ఐదువందలు కిమ్మత్తుచేసే నెక్‌లేస్ చేయించి పెట్టడం లక్షువమ్మకి యిష్టంలేదు. పైగా ఆ నెక్‌లేసు తన చేతులారా చేయించి పెట్టడమంటే మనసు అంగీకరించడంలేదు అందుచేత, లక్షువమ్మ బాగా ఆలోచించి, చివరికి ఓపని చేసింది.

బజారుకి వెళ్ళి, కవరింగ్ గోల్డు నగలషాపులో మాంచి డిజైనులో, కళ్ళకి మిరుమిట్లు గొలిపే యిమిటేషన్ రవ్వల నెక్‌లేసు ఒకటి, పాతికరూపాయలు పెట్టికొని, అదే డిజైనులో మంచి రవ్వలతో వెయ్యి రూపాయలూ వెచ్చించి ఓ నెక్‌లేస్ దగ్గరుండి చేయించింది. రెండు చక్కని దంతపుపెట్టెలు తెప్పించి చెరో పెట్టెలో భద్రపరచి వుంచింది.

ఒక్క లక్షువమ్మ తప్పితే వాటిని చూచిన మరెవ్వరూ ఒకటి నకిలుదనీ, రెండోది అసలుదనీ తెలుసుకోలేనంత 'ఇది'గావున్నయ్.

ఎదురుచూస్తోన్న సంక్రాంతి రానేవొచ్చింది. అల్లుళ్ళూ కూతుళ్ళూ దిగబడ్డారు. అల్లుళ్ళకి కానుకలు చెల్లించుకున్న తరువాత, కొత్తబట్టలతోబాటు కూతుళ్ళిద్దరికీ చెరో నెక్‌లేసూ తాంబూలంలో పెట్టి లక్షువమ్మ చేతులారా చెల్లించుకుంది. నెక్‌లేస్‌లు చూసేసరికి



కూతుళ్ళిద్దరికీ చెరో నెక్లేసూ, తాంబూలంలో పెట్టి లక్ష్మమ్మ చేతులారా పెట్టింది.

# ★ నకిలీ నెక్లేసు ★

కూతుళ్ళకళ్లు చెదిరిపోయినై. తాము కోరకుండానే తమకు నెక్లేసులు చేయించిపెట్టినందుకు సంతోషించారు. కాని, లక్ష్మమ్మ చేసిన మోసం ఎవరికీ తెలియదు. పెద్దకూతురు విమలకి పెట్టింది గోల్డు కవరింగ్ ఇమిటేషన్ రాళ్ల నెక్లేసని, తన కూతురు కమలకి పెట్టింది మాత్రమే సిసలైన రవ్వల నెక్లేసనీ ఎవరు మాత్రం ఎలా పసిగట్టగలరు?

విమల భర్త తనకు ఆఫీసులో సెలవు మంజూరు కాలేదని మరునాటి రోజే ప్రయాణం కట్టాడు వూరికి. కాని, విమలని నాలుగురోజులుంచమని మామగారు బ్రతిమాలటం చేత విధిలేక, విమలను వొదిలిపెట్టి, తానొక్కడే వెళ్ళిపోయాడు.

కమల భర్త కమలతోబాటు మామగారింట్లో నాలుగురోజులుండి పోవడానికి వొప్పుకున్నాడు.

ఆనాటిరాత్రి ఎవరి గదుల్లో వారు పడుకుని నిద్రపోతున్నారు. కమల ఓ వేళప్పుడు నిద్రలేచి చూసుకునే సరికి, టేబుల్ మీద పెట్టిన నెక్లెస్ అపుపించలేదు. దీపం పెద్దదిచేసి, తనకి అనుమానం వేసిన చోటల్లా వెదికింది. లాభం లేకపోయింది. చివరికి యేదో ఆలోచించుకొని దొంగలా అడుగుమీద అడుగేసుకుంటూ విమల గదిలోకి దారితీసింది.

విమల మాంచినిద్రలోవుంది. మెల్లిగ్గా విమల పెట్టె తెరిచి, ఆమె నెక్లేసు కాస్తా సంగ్రహించి, ఏమీ తెలియనివ్వానికి మళ్లీ వెళ్ళి తనగదిలో పడుకుంది.

తెల్లవారింది. విమల నెక్లేసు కోసం తనపెట్టె తెరిచి చూసుకునే సరికి నెక్లేసు కనుపించలేదు. పాపం! విమల కంగారులో గతుక్కుమంది. రాత్రి పడుకునేప్పుడు నెక్లేస్ పెట్టెలోనే పెట్టినట్టు తనకి బాగా జ్ఞాపకం! ఇంతలో ఎలా మాయమయిందో ఆమెకి అర్థం కాలేదు.

నెక్లేస్ పోయిన సంగతి ఇంట్లో అందరికీ తెలిసిపోయింది. ఇంటిల్లిపాదీ వెదకడం ప్రారంభించారు. నెక్లేసు దొర్కలేదు సరికదా మామగారిల్లి దగ్గర చివాట్లుకూడా తప్పలేదు.

విమల తన దురదృష్టానికి తనను తాను నిందించుకుంది.

కమలమాత్రం తను చేసిన ఘనకార్యానికి లోలోపల తన్నుతానే అభినందించుకుంది.

తనుచేసిన కుట్ర బయటపడ డానికి ఆస్కారంలేకండా, విమల నెక్ లేసుని పోగొట్టుకుని సాయపడి నందుకు, లక్షువమ్మ లోలోపల సంతసించింది.

జానకి రామయ్యగారికిమాత్రం యిందులో యేదో మోసం జరిగిం దని అనుమానంగానే వుంది.

మరునటిరోజే కమలా, కమల భర్తా తమవూ రెళ్ళిపోయారు.

విమల తన భర్త రాకకోసం ఎదురుచూస్తూవుంది.

ఆరోజు ఎందుకో దొడ్లోకి వెళు తోంటే, యింటిచూరులో ఏదో మిలమిలలాడ్డం జానకి రామయ్య గారి కంటబడింది తీరా దగ్గరికి వెళ్ళి చూచేసరికి, నెక్ లేసు! ఇది యెలు కలు చేసినపనేనని, జానకిరామయ్య గారికి అర్థంకావడానికి, అట్టే కాలం పట్టలేదు. పోయిన వస్తువు దొరికి నందుకు జానకిరామయ్యగారు సంతోషంగా వున్నారు లక్షువమ్మ గారుకూడా పైపైకి సంతోషం ప్రక టించినా, లోలోపల తన బండారం బయటపడుతుందేమోనని భయం గానే వుంది. ఇహ, విమల సంతో షానికి మేరలేకపోయింది ఆరోజే విమల భర్త రావడం, మరునాడు విమల తన భర్తతోబాటు తమ వూరికి వెళ్ళిపోవడం జరిగింది.

రోజులు దొర్లుతున్నయ్.

ఒకరోజు జానకిరామయ్యగారికి, కమల భర్తవద్దనించి ఓ వుత్తరం వొచ్చింది:—

"మీరు యింత నీచానికి వొడి కడతారని మేము కల్లోగూడా అను కోలేదు. ఐదువందలు కిమ్మతుచేసే నెక్ లేసని చెప్పి, మీ కుమార్తెకు కవరింగుగోల్డు ఇమిటేషన్ రాళ్ళ నెక్ లేస్ పెట్టి పంపారు. మీ మత లబు మా కర్థం కాలేదు. అసలు, మిమ్మల్ని మాకది పెట్టమని అడిగినవా ళ్ళేవరు?" - అని.

జానకిరామయ్యగారు ఆ వుత్త రాన్ని చదువుకుని మండిపడ్డాడు. ఉత్తరాన్ని లక్షువమ్మముఖానకొట్టి, అసలు విషయం యేమిటో చెప్ప మని గద్దించి అడిగేసరికి, విధిలేక తను చేసినఘనకార్యం కాస్తా పూస గుచ్చినట్టు చెప్పేంది. ఈవిషయం, ఏనాటికయినా బయట పడుతుందని ఆమెకు ముందే తెలుసు. కాని, విమలకు పెట్టిన నకిలీనగ కమల కెలా బదిలీ అయిందో ఆమె కర్థం కాలేదు.

జానకి రామయ్యగారికూడా ప్రథమంలో అంతా అగమ్యగోచ రంగా వున్నప్పటికీ, తన చిన్న కుమార్తె కమల గుణగణాలు ఎరి గినవా డవడంచేత, జరిగిందంతా చూచాయగా వూహించుకో గలి గాడు.

"అంతే లే, నీ ఓర్వలేనితనం నిన్నే కొట్టింది నీమేనల్లుడికి, ఏం జవాబురాస్తావో నువ్వే రాసుకో, దరిద్రప్పీనుగా!" అని, హేళనగా నవ్వేసరికి, లక్షువమ్మమూతి, ఇంతై పోయింది. కాని, నకిలీనగ కమలకి ఎలా బదిలీ అయిందో, ఆవిడికి, ఇంకా అగమ్యగోచరంగానే వుంది.

★

